క్లుప్తంగా

చిరువ్యాపారులకు అండగా లయన్స్ క్లబ్



కంకిపాడు: చిరు వ్యాపారులకు లయన్స్ క్లబ్ అండగా నిలుస్తుందని క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో పట్టణంలోని గొడవర్రు రోడ్డులో చిరు వ్యాపారాలు సాగించే పలువురికి ఎండ నుంచి రక్షణ పొందేలా పెద్ద గొడుగులను ఆదివారం అందజేశారు. వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మద్దుల యుగంధర్, చవట శంకర్ రావు, మద్దుల గోవిందరావు పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాధించాలి

పెనమలూరు: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఎస్ఐ ఉషారాణి అన్నారు. మహిళా దినోత్సవం వారోత్సవాల సందర్భంగా పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళల పాత్ర, సామాజిక, ఆర్థిక, రాజకీయ వంటి పలు అంశాల్లో మహిళలు ముందంజలో ఉండి మహిళా సాధికారత సాధించాలని సూచించారు. మహిళ చట్టాల గురించి వివరించారు. పోక్సో యాక్టు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న నేరాలు, పలు అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ వద్ద ఆదివారం అమెరికన్ కిడ్నీ ఇన్‌స్టిట్యూట్ విజయవాడ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య నిపుణులు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అనంతరం కిడ్నీ, బీపీ, షుగర్, వ్యాధులకు సంబంధించి 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. శిబిరంలో వైద్యులు సీహెచ్ విఠల్ కుమార్, ఎ సాయి స్వప్న, బీ వరుణ్‌కుమార్, వీ స్పందన, ఎస్ ఉషశ్రీ, గంగాప్రసాద్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు

పెనమలూరు: యనమలకుదురులో మహిళ అదృశ్యమైన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. ధనేకుల నరేష్ తన కుటుంబ సభ్యులతో యనమలకుదురులో ఉంటున్నాడు. ఆయనకు కుమార్తె (29), కుమారుడు సంతానం. కుమార్తెకు గతంలో వివాహం జరుగగా భర్తతో విబేధాల కారణంగా విడిపోయింది. అప్పటి నుంచి ఆమె తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. అయితే గత నెల 28వ తేదీన ఆమె ఇంటి నుంచి అదృశ్యమయింది. ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. కుమార్తె అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెద్ద అవుటపల్లి ఘటనపై డీవైఈవో విచారణ

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం పెద్ద అవుటపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం కొందరు విద్యార్థులతో స్కూల్ ముందు సిమెంట్ ఫ్లోరింగ్ చేయించారు. ఈ ఘటనపై స్థానికుల ఫిర్యాదుతో గుడివాడ డీవైఈవో రవికుమార్ ఆదివారం విచారణ చేపట్టారు. అక్కడ జరిగిన సంఘటనపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించామని తెలిపారు. తదుపరి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం సూర్యోపాసన సేవ నిర్వహించారు. లోక సంరక్షణార్థం, సర్వ మానవాళికి పరిపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ప్రతి ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్య భగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవను నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు. అనంతరం ప్రసాదాల వితరణ చేసి, ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

వంతెన చింత తీరేదెలా.?

- బుడమేరుపై శిథిలావస్థకు చేరిన వంతెన
- ఇబ్బందులు పడుతున్న జక్కులనెక్కలం గ్రామస్తులు



జక్కులనెక్కలం వద్ద బుడమేరుపై ఉన్న పాత వంతెన

గన్నవరం రూరల్: మండలంలోని జక్కులనెక్కలం గ్రామస్తులు బుడమేరుపై వంతెన నిర్మాణం కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. పాలకుల హామీలు, అధికారుల మాటలు విని విసుగెత్తిపోతున్నారు. గన్నవరం మండలంలోని జక్కులనెక్కలం గ్రామం విజయవాడ రూరల్ మండలం గూడవల్లిని ఆనుకుని ఉంది. జాతీయ రహదారి నుంచి కేవలం కిలో మీటరు దూరం లోపలకు ఉంటుంది. గూడవల్లి వద్ద జాతీయ రహదారి దిగి ఈ గ్రామంలోకి వెళ్లాలంటే బుడమేరు దాటాల్సిందే. విజయవాడ నుంచి ప్రవహిస్తూ వచ్చే బుడమేరు దాటి జక్కులనెక్కలం గ్రామం వెళ్లాలి. అయితే ఎన్నో దశాబ్దాల క్రితం ఈ ప్రదేశంలో బుడమేరుపై నేల బారు వంతెన నిర్మించారు. కాలక్రమంలో అది శిథిలావస్థకు చేరింది. అంతేగాక అప్పట్లో ఎత్తుగా నిర్మించకపోవడం కూడా శాపంగా మారింది.

తరచూ మునిగిపోతున్న వంతెన

ఈ గ్రామంలో వెయ్యి మంది జనాభా నివసిస్తున్నారు. విద్యార్థులు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు నిరంతరం ప్రయాణం చేస్తుంటారు. వంతెన దాటి గ్రామంలోని వెళ్లే రహదారికి ఇరువైపులా వందలాది ఎకరాల మాగాణి భూములు ఉన్నాయి. చెరుకు తోటలు, వెంచర్లు ఉన్నాయి. ప్రతిరోజూ వ్యవసాయ కార్మికులు పనుల కోసం వందల మంది ఈ వంతెనపై ప్రయాణం చేస్తుంటారు. అటువంటి వంతెన చిన్నపాటి వర్షాలకు, వరదలకు మునిగిపోతోంది. బుడమేరు పొంగితే ఈ గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఇప్పటికే అనేకసార్లు వరద వచ్చే సమయంలో ఆ గ్రామం వరదల్లో చిక్కుకుపోయింది.

బల్లకట్టుతో ప్రయాణం

గ్రామంలో నుంచి బయటకు రావాలంటే ఈ రోడ్డు, బుడమేరు వంతెన మాత్రమే శరణ్యం. కాబట్టి ఈ వంతెన ఎత్తు పెంచి కొత్తది నిర్మించాని గ్రామస్తులు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తున్నారు. కానీ వారి గోడు ఎవరికీ పట్టడం లేదు. గ్రామానికి ఉత్తరం వైపు ఏలూరు కాలువ ప్రవహిస్తోంది. దానిపై కూడా వంతెన లేదు. బల్లకట్టు ప్రయాణంతో నెట్టుకొస్తున్నారు. కాబట్టి బుడమేరుపై తక్షణమే వంతెన నిర్మించాల్సి ఉంది.

ఏకైక రోడ్డు మార్గం



వరదలు, వర్షాల సమయంలో ఇప్పుడున్న వంతెన మునిగిపోతోంది. గ్రామానికి ఉన్న ఏకైక రోడ్డు మార్గం ఇదే. ప్రభుత్వం చర్యలు తీసుకుని నూతన వంతెన నిర్మించాలి. బుడమేరు వరదల సమయంలో గ్రామంలో బిక్కుబిక్కుమంటూ గడిపాం.

– మంగలపూడి ప్రకాష్, గ్రామస్తుడు

ప్రభుత్వం స్పందించాలి

బుడమేరుపై వంతెన నిర్మాణం కోసం అనేక సార్లు అర్జీలు అందజేశాం. అటు అధికారులు గాని, ఇటు పాలకులుగాని ఎవరూ మా సమస్యను పట్టించుకోలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– ఎస్.విశ్వనాథం, గ్రామస్తుడు

పట్టించుకోని పాలకులు, అధికారులు

అధికారులను, పాలకులను గ్రామస్తులు వందల సార్లు ఇక్కడ వంతెన నిర్మాణం చేయాలని కోరారు. కానీ వారి గోడు పట్టించుకున్న నాథుడే లేరని వాపోతున్నారు. ఇటీవల వరదల సమయంలో జక్కులనెక్కలంకు ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. చుట్టూ వరదతో వారం రోజులు ఇబ్బంది పడ్డారు. పడవలపై అధికారులు గ్రామంలోకి వెళ్లి పునరావాస చర్యలు చేపట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుని బుడమేరుపై ఎత్తుగా నూతన వంతెన నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బుడమేరులో ప్రవహిస్తున్న నీరు

పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్



అంతర్గత రహదారుల్లో చెత్తను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో గత మూడు రోజుల నుంచి పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం డ్రెయిన్లు పూడిక తీసి, చెత్త కుప్పలను పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రధాన గ్రామంతో పాటు కాలువగట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలోని వాటర్ ట్యాంకు రోడ్డు, సెయింట్ ఆన్స్ పాఠశాల రోడ్డు, ఎస్సీ కాలనీ, బీఎంపీఎస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో చెత్తను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించినట్లు తెలిపారు. సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి పూడిక తీయిస్తున్నామని చెప్పారు. చెత్త తొలగించిన ప్రాంతాల్లో బ్లీచింగ్ ఫౌడర్ చల్లించామని వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

రేపు శ్రీకోటయ్యస్వామి ఉరుసు మహోత్సవం



ఉత్సవాలకు ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న సంఘ నేతలు

గన్నవరం: స్థానిక కొత్తపేటలో వేంచేసియున్న శ్రీకోటయ్యస్వామి ఆలయంలో ఈ నెల 4వ తేదీ మంగళవారం 15వ ఉరుసు మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో జరగనున్న ఈ ఉత్సవాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అన్న సంతర్పణ, సాయంత్రం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలకు కృష్ణబలిజ సంఘం తరుపున గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావును ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. కృష్ణబలిజ కుటుంబ సభ్యులు, పట్టణ ప్రజలు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

క్రీడల్లో సత్తాచాటిన విద్యార్థినులు



హ్యాండ్‌బాల్ విజేతలుగా నిలిచిన గన్నవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో అత్యుత్తమ క్రీడా నైపుణ్యం కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డీ ఝాన్సీరాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసరపల్లిలోని ఎన్టీఆర్ వెటర్నరీ కళాశాలలో హిల్, హెచ్‌సీఎల్ ఫౌండేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో హ్యాండ్‌బాల్ విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు. తద్వారా బెంగళూరులో జరగనున్న సౌత్ జోన్ క్రీడా పోటీలకు తమ విద్యార్థులు అర్హత సాధించినట్లు వెల్లడించారు. అదేవిధంగా పుట్‌బాల్, షాట్‌పుట్, క్యారమ్స్‌లో ద్వితీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. క్రీడా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన వ్యాయామోపాధ్యాయులు గీత, కృష్ణప్రియను ఉపాధ్యాయ బృందం అభినందించినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి బాటలు



ప్రారంభోత్సవానికి సిద్ధమైన కాటూరు బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం

ఉయ్యూరు రూరల్: కేర్ టు యాక్షన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయంతో మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాలకు అభివృద్ధి బాట వేస్తున్నామని ఉయ్యూరు ఎంపీడీవో జీవీఎస్ శేషగిరి రావు తెలిపారు. కేర్ టు యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటికే ఉయ్యూరు పట్టణంలోని లంబాడి పేట, సుందరం పేట, కాపుల రామాలయం, ఏరియాలో పూర్తిస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మాణం చేయడం జరిగిందని తెలిపారు. దీనికి తోడు మండలంలోని గండిగుంటతోపాటు కాటూరులోని మరో రెండు కేంద్రాలను లక్షలాది రూపాయలతో నిర్మాణం పూర్తయిందని చెప్పారు. ఈ క్రమంలో కాటూరు బీసీ కాలనీలో సుమారు రూ. 22 లక్షలతో అన్ని హంగులతో అంగన్‌వాడీ కేంద్రాన్ని పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కేంద్రాన్ని ఈనెల 5వ తేదీన ప్రారంభించనున్నామని వెల్లడించారు. ఇటలీ దేశస్తుడు, కేర్ టు యాక్షన్ డైరెక్టర్ ఆంటోనీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. ఏపీ ప్రతినిధిగా డైరెక్టర్‌గా ఉన్న వెంకటస్వామి, ప్రోగ్రాం ఆఫీసర్ గ్రేస్‌తోపాటు సంస్థ ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. రానున్న కాలంలోనూ ఈ సంస్థ ద్వారా పలు అంగన్‌వాడీ కేంద్రాల పునర్నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని, స్వచ్ఛంద సంస్థల సేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రామిక పక్షపాతి వుప్పల లక్ష్మణరావు



విజయవాడకల్చరల్: శ్రామిక పక్షపాతి డాక్టర్ వుప్పల లక్ష్మణరావు అని రచయిత్రి, అనువాదకురాలు ఓల్గా అన్నారు. సాహితీమిత్రులు ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్‌లోని శిఖరా స్కూల్‌లో నవలా రచయిత, అనువాదకుడు, సంపాదకుడు లక్ష్మణరావు సాహిత్య రచనల గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఓల్గా వుప్పల సాహితీ ప్రస్థానంలోని అనేక విషయాలను వివరించారు. ఆయన రచించిన అతడు-ఆమె నవల ద్వారా సాహితీ ప్రపంచంలో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారన్నారు. అతని రచనల్లో సామాజిక బతుకు కనిపిస్తోందని చెప్పారు. మాస్కోలోని ప్రగతి ప్రచురణాలయం ద్వారా అనేక రచనలను తెలుగులోకి అనువదించారని తెలిపారు. అతడు ఆమె నవల చదివిన తర్వాత ఆమె – మనం పేరుతో పెద్ద వ్యాసం రచించిన సందర్భం గుర్తు చేసుకున్నారు. శ్రీశ్రీ ప్రింటర్స్‌ను విశ్వేశ్వరరావు ప్రారంభించాక ప్రచురించిన రెండో పుస్తకమేనన్నారు. తనను ప్రభావితం చేసిన అంశాలు వారిలో కనిపించాయని గుర్తు చేసుకున్నారు. కవి బండ్ల మాధవరావు మాట్లాడుతూ.. నవలా రచయితగా, అనువాదకుడిగా తెలుగు సాహిత్యానికి సేవలను అందించారని తెలిపారు. బరంపురానికి చెందిన వికాసం సంస్థ ప్రతినిధులు ఎంవీ కామేశ్వరరావు, బీ రవిశర్మ, సేతుపతి ఆదినారాయణలు, చినుకు మాసపత్రిక సంపాదకుడు నండూరి రాజగోపాల్ వుప్పల ఆయన జన్మించిన బరంపురంతో అనుబంధం సాహిత్య జీవిత విశేషాలను వివరించారు.

ఘనంగా నివేదిత గురుకులం వార్షికోత్సవాలు



మాట్లాడుతున్న భాగయ్య



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

ఉంగుటూరు: మండల కేంద్రమైన ఉంగుటూరులో జయరామ విజ్ఞాన విహార ఆవరణలో ఏర్పాటు చేసిన నివేదిత గురుకులం ప్రథమ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్, అఖిల భారతీయ కార్యకారిణి సదస్సులు ప్రతినిధి భాగయ్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. స్వదేశంలో తయారైన ఉత్పత్తులను విదేశాలు మన వద్ద నుంచి తీసుకుని విక్రయించుకునే విధంగా విద్యార్థులు ప్రతిభను సాధించాలని ఆకాక్షించారు. నివేదిత గురుకులం బాలికల కోసం ప్రత్యేకంగా విజ్ఞాన విహార ఆధ్వర్యంలో ప్రారంభించి సంవత్సరం పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. 40 మంది విద్యార్థులను ఐదవ తరగతికి పంపించారని తెలిపారు. నాలుగవ తరగతి నుంచి నివేదిత గురుకులంలో విద్యార్థులను చేర్చుకుంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, విన్యాసాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో విజయవాడ విజ్ఞాన విహార అధ్యక్షుడు బీవీఎస్టీ సాయి, జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు విజయ భారతి, రామకృష్ణ శారద మిషన్ ప్రతినిధులు బోధనమ ప్రాణ, త్యాగనిష్ఠ ప్రాణ, హెచ్ఎం సావిత్రి పాల్గొన్నారు.

50 ఏళ్లు నిండిన వారికి పెన్షన్లు మంజూరు చేయాలి



జానీకి నియామక పత్రం అందజేస్తున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా

పాయకాపురం(విజయవాడరూరల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం మేరకు 50 ఏళ్లు నిండిన వారికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేయాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక నాగుల్‌మీరా డిమాండ్ చేశారు. స్థానిక 64వ డివిజన్ కండ్రిక కార్యాలయంలో ఆదివారం జరిగిన నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు గడుస్తున్నా కొత్త పెన్షన్ల మంజూరు విషయం ప్రస్తావించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వాన్ని గెలిపించిన ప్రజలు సంక్షేమ పథకాల కోసం సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారన్నారు. కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 64వ డివిజన్‌కు చెందిన మొహమ్మద్ జానీని ఏఎంసీ డివిజన్ సహాయ కార్యదర్శిగా నియమించి నియామక పత్రం అందజేశారు. కమిటీలో సభ్యత్వం తీసుకున్న వారు యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని పిలుపునిచ్చారు. ఆయా ప్రాంతాల్లో కమిటీని బలోపేతం చేసే దిశగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజిద్ అలీ, ఉపాధ్యక్షుడు నాగుల్ మీరా, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజా, నగర ప్రధాన కార్యదర్శి ఎండీ ఇస్మాయిల్, నగర అధ్యక్షుడు షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ ఫిరోజ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదపులిపాక శివారులో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేయగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద పేకలు, రూ. 4,010 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం మల్లెలు పూసే వెన్నెల కాసే పేరుతో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. హైదరాబాద్, నగరానికి చెందిన పలువురు గాయనీ గాయకులు చిత్ర గీతాలను మధురంగా ఆలపించారు. సీనియర్ గాయకుడు వైఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్ లలిత, వీణ, గంటిశైలజ, మల్లేశ్వరి, స్వరకల్యాణి, రాధాకారాణి, భారతి, శివరామకృష్ణ, రవీంద్రనాథ్ ఆచార్య, కృష్ణమోహన్, అవినాష్‌లు చిత్రగీతాలను ఆలపించారు. వ్యాఖ్యాతగా గాయకుడు ప్రభాకర్ వ్యవహరించారు.

లైబ్రేరియన్ మల్లిరెడ్డికి డాక్టరేట్



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌కు చెందిన మల్లిరెడ్డి శ్రీనివాసరెడ్డి ద్రవిడ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. కేఎల్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డి గత కొంతకాలంగా ద్రవిడ విశ్వవిద్యాలయం(కుప్పం)లో ఆఫ్ క్యాంపస్ పార్ట్‌టైం రీసెర్చ్ స్కాలర్‌గా పరిశోధనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లైబ్రరీ సైన్స్ విభాగంలో 'గ్రంథాలయ వినియోదారుడు సంబంధాన్ని మెరుగుపర్చడంలో ఇంటర్నెట్ సామర్థ్యాన్ని అంచనా వేయడం' అనే అంశంపై చేసిన పరిశోధనకుగానూ డాక్టరేట్ అందుకున్నట్లు మల్లిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం విలేకరులకు తెలిపారు. డాక్టరేట్ పొందిన శ్రీనివాసరెడ్డికి పలువురు మిత్రులు, తోటి ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఇసుక దారులు

- మేట వేసుకుపోయిన ఇసుక
- జారిపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



గోసాల-మద్దూరు రహదారిపై మేట వేసుకుపోయిన ఇసుక

కంకిపాడు: రబ్బిష్ రోడ్లు, తారురోడ్లు, సిమెంటు రోడ్లు తెలుసు.. ఇవేంటి ఇసుక దారులు అనుకుంటున్నారా.? అదే మరి.. ఇసుక రోడ్లపై మేట వేసుకుపోవడంతో రహదారులు ఇసుక దారులుగా మారిపోయాయి. ఈ రోడ్ల మీదుగా ప్రయాణించే వాహనదారులు జారిపడి గాయపడుతున్నారు. ప్రజలకు ప్రాణసంకటంగా మారుతున్నా.. అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

భారీ ఇసుక లోడు వాహనాలు

కృష్ణానది పాయలో పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల్లోని పలు ఏటి పాయ ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. పగలూ, రాత్రి తేడా లేకుండా ఇసుక లోడు వాహనాలు ఇసుక రవాణా సాగిస్తున్నాయి. అయితే ఇసుక తరలింపు ప్రక్రియే అడ్డగోలుగా మారింది. ట్రాక్టర్లు, లారీల్లో పరిమితికి మించి ఇసుక లోడు చేసి ఆయా గ్రామాలకు తరలిస్తున్నారు. నిబంధనల మేరకు లోడు వాహనాలపై టార్పాలిన్‌లు, పరదాలు కప్పుతున్నా వాహనాల మార్జిన్‌ల నుంచి ఇసుక జారిపోతుంది. జారిపడ్డ ఇసుకతో రోడ్లు మొత్తం ఇసుకమయంగా మారుతున్నాయి.

రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ప్రధానంగా ఇసుక తరలించే మార్గాలైన రొయ్యూరు-కంకిపాడు, మద్దూరు-గోసాల ఫ్లైఓవర్ అండర్‌పాస్‌ల వద్ద ఇసుక మేటతో నిండిపోతున్నాయి. ఇసుక గుట్టలుగా పడి రోడ్డు పరుచుకుపోవడంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ద్విచక్రవాహనదారులు ఇసుక మేట కనిపించకపోవడంతో వాహనాలు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. గడిచిన పది రోజుల్లో కంకిపాడు పరిసరాల్లోనే ద్విచక్రవాహనదారులు కేవలం ఇసుక మేటల కారణంగా పది మంది గాయపడినట్లు సమాచారం.

అధికారుల చర్యలేవీ.?

ట్రాక్టర్లు, లారీల్లో భారీ లోడుతో ఇసుక రవాణా సాగిస్తున్నారు. కానీ రవాణా శాఖ, పోలీసు, రెవిన్యూ, విజిలెన్స్ వంటి నిఘా విభాగాలు ఏవీ పట్టించుకోవడం లేదు. అధికారుల ఉదాసీన వైఖరితో ట్రాక్టర్లు, లారీల యజమానులు అడ్డగోలుగా పరిమితికి మించి ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. భారీ లోడు రవాణాతో సమస్య తీవ్రతరం అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.